నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 6 జూలై 2024 | KAMAREDDY

లింగంపేట పోలీసుస్టేషన్‌లో నిరుద్యోగులు, బోధన్ పోలీసుస్టేషన్ వద్ద బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సతీశ్‌చారి

ముందస్తు అరెస్టులు

లింగంపేట/ఏర్గట్ల/శక్కర్‌నగర్, జూలై 5: విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి వెళ్లకుండా విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సత్యనారాయణ, సంగాగౌడ్, వివేకానంద, సంజీవులు, సురేశ్‌ను స్థానిక పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేసినట్లు నిరుద్యోగులు తెలిపారు. ఏర్గట్ల మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన 8 మంది, తడ్‌పాకల్‌కు చెందిన ముగ్గురిని మొత్తం 11మంది ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్సై జె మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలో అమర్‌దాస్, కుండ చక్రి, ఈశ్వర్ తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ విద్యార్థి సంఘం బోధన్ అధ్యక్షుడు వడ్ల సతీశ్‌చారి, విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేశ్‌ను శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన విద్యార్థి సంఘాల నాయకులను సొంతపూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

నిరుద్యోగులను అదుపులోకి తీసుకొని ఏర్గట్ల పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు

నిరసనలపై నిర్బంధం

అక్రమ అరెస్టులు

- నిరుద్యోగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 'నిరుద్యోగుల మార్చ్'పై ఆంక్షలు
- ఉమ్మడి జిల్లాలో గృహ నిర్బంధాలు
- రేవంత్ ప్రభుత్వ తీరుపై నిరుద్యోగ యువత ఆగ్రహం
- గ్రూప్ -2, 3లో పోస్టులు పెంచాలని డిమాండ్

గ్రూప్ పోస్టుల సంఖ్య పెంచాలని, మెగా డీఎస్సీ వేయాలని, జాబ్ క్యాలెండర్, జీవో 46 రద్దు తదితర డిమాండ్లతో నిరుద్యోగులు చేపట్టిన ఉద్యమంపై సర్కారు ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి నిరుద్యోగులు పిలుపునివ్వగా.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి యువత రాజధానికి వెళ్లకుండా ప్రభుత్వం అడ్డుకున్నది. ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేసింది. దీంతో ప్రభుత్వ తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరసనలు వ్యక్తంచేస్తున్నారు.

–నిజామాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కొంతకాలంగా రేవంత్‌రెడ్డి సర్కారుపై నిప్పులు చెరుగుతున్న నిరుద్యోగ లోకం శుక్రవారం టీజీపీఎస్సీ(తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్) కార్యాలయ ముట్టడికి సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి భారీగా యువత కదం తొక్కేందుకు సిద్ధమవ్వగా ఉక్కుపాదంతో ప్రభుత్వం అణిచివేసింది. ప్రభుత్వ ఆదేశాలతో అర్ధరాత్రి నుంచే విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు నిరుద్యోగుల ఇండ్లకు పోలీసులు వెళ్లి వారిని వెంబడించి అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులతో పోలీసులు భయానక పరిస్థితిని సృష్టించారు. ప్రజాస్వామ్యయుతమైన మన దేశంలో నిరసనలు తెలపడం ప్రతి పౌరుడి హక్కు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఉక్కుపాదంతో నిరసనలను అణిచివేస్తుండడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ తీరుపై నిరుద్యోగ యువత తీవ్ర స్థాయిలో మండిపడుతున్నది.

హామీల అమలు కోసం ఉద్యమబాట..

ఎన్నికలకు ముందు సవ్యంగా చదువుకుంటున్న వారందరినీ రోడ్లపైకి తీసుకు వచ్చి గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు చేయించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే (గ్రూప్ –1, 2, 3 పోస్టులను పెంచుతామని పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నియామకాలను నిరంతర ప్రక్రియ మాదిరిగా నిర్వహిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించారు. గద్దెనెక్కిన తర్వాత యువతను పట్టించుకోవడం మానేశారు. గ్రూప్ –1లో నామమాత్రంగా పోస్టులను పెంచి ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. గ్రూప్– 2, 3 లో పోస్టుల సంఖ్య పెంచాలని కోరుతున్నా స్పందన కరువైంది. గ్రూప్ –1 ప్రిలిమ్స్‌లో 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. గతేడాది గ్రూప్ –1 ప్రిలిమ్స్ రద్దు కాక ముందు ఇదే కాంగ్రెస్ పార్టీ నేతలంతా 1:100 నిష్పత్తిలో ఫలితాలివ్వాలని కోరడం గమనార్హం.

నిరుద్యోగుల్లో ఆందోళన..

కేసీఆర్ సర్కారు హయాంలో నిర్వహించిన గురుకుల నియామకాలకు, నర్సింగ్ స్టాఫ్, పోలీస్ నియామకాలకు సంబంధించిన ఫలితాలను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియామకాలు చేపడితే నియామక పత్రాలిచ్చి అంతా తామే చేశామంటూ కాంగ్రెస్ చెప్పుకుంటోంది. మరోవైపు గ్రూప్ –4 ఫలితాలు వెలువడగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ మాత్రమే జరుగుతోంది. కొత్తగా ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయకపోగా..టెట్ మాత్రమే ఈ ప్రభుత్వం నిర్వహించింది. ఇప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం నిరుద్యోగులు చేస్తున్న పోరాటాలతో రాబోయే రెండు, మూడు నెలల్లో నిర్వహించే గ్రూప్ –2, 3 పరీక్షలు ఉంటాయా? ఉండవా? అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. పోస్టులు పెంచి డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని యువత కోరుతుండడంతో టీజీపీఎస్సీ మాత్రం ససేమిరా అంటోంది.

అరెస్టయి ఆర్మూర్ పోలీసుస్టేషన్‌లో ఉన్న బీజేవైఎం నాయకులకు సంఘీభావం తెలుపుతున్న పార్టీ నేతలు

అరెస్టు చేయడం సరికాదు..

ఆర్మూర్‌టౌన్, జూలై 5: మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముట్టడికి బయల్దేరిన బీజేవైఎం నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి ఆర్మూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారికి బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్ మాట్లాడుతూ.. బీజేవైఎం ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి పిలుపునిచ్చామని, ఈ నేపథ్యంలో నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కలిగోట్ గంగాధర్, ప్రశాంత్, నాయకులు ఉన్నారు.



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు

రెండు లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

బీజేవైఎం డిమాండ్.. కామారెడ్డి కలెక్టరేట్ ముట్టడి

కామారెడ్డి, జూలై 5: కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పొందుపర్చిన ప్రకారం జాబ్ క్యాలెండర్ అమలుచేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం కామారెడ్డి కలెక్టర్ ఆఫీస్‌ను ముట్టడించి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగులే కాంగ్రెస్‌ను గెలిపించారని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు, కార్యదర్శి ప్రభాకర్, శ్రీకాంత్, జిల్లా నాయకులు నరేశ్, రాజశేఖర్, నరేశ్, రాజేశ్, శివ, సత్యం, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో 80 మంది అరెస్టు

వినాయక్‌నగర్, జూలై 5: టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి వెళ్లే విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అడుకున్నారు. అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో పోలీసులు శుక్రవారం తెల్లవారు జాము నుంచి అరెస్టులు మొదలు పెట్టారు. ఇండ్ల వద్ద నిఘా ఉంచి ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో సుమారు 80 మందిని ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అనంతరం వారిని మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో బీజేవైఎం నాయకుడు

జిల్లా కేంద్రంలో అరెస్టయిన విద్యార్థి సంఘాల నాయకులు

అక్రమంగా అరెస్టు చేశారు..

ఎల్లమ్మగుట్టలోని మా నివాసంలో ఉంటున్న మమ్మల్ని అక్రమంగా అరెస్ట్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అడిగితే అక్రమంగా అరెస్టు చేయిస్తారా. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పేరిట లక్షలు దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడలేదు. మెగా డీఎస్సీ ప్రకటించి 24వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

-రాకేశ్, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

హామీలను వెంటనే నెరవేర్చాలి

ఖలీల్‌వాడి, జూలై 5: ఖాళీగా ఉన్న 24 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి. గ్రూప్‌లో పోస్టుల సంఖ్య పెంచాలి. విద్యారంగా సమస్యలను పరిష్కరించాలి.

- సునీల్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్

వర్షాకాలం వచ్చినా భారీ వర్షాలు కరువయ్యాయి. మధ్యాహ్నం వేళ ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. కొన్ని రోజులుగా ప్రతిరోజూ ఆకాశం మేఘావృతమవుతున్నా అప్పుడుప్పుడు మాత్రమే చిరుజల్లులు కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం ఇందూరు నగరంపై నల్లని మేఘాలు దట్టంగా అలుముకోగా.. వర్షం కురుస్తుందేమోనని నగరవాసులు ఆసక్తిగా ఆకాశంవైపు చూశారు. కానీ వాన జాడలేదు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మా సార్ మాగ్గావాలే..

ట్రాన్స్‌ఫర్‌ను నిలిపివేయాలని తల్లిదండ్రుల పట్టు

రాజంపేట్, జూలై 5: బదిలీపై వెళ్లే సార్లను విద్యార్థులు పట్టుకుని రోదించిన ఘటనలను చూశాం. కానీ తొలిసారిగా తల్లిదండ్రులు సైతం ఉపాధ్యాయుడి కోసం కదిలి వచ్చిన ఉదంతం కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం శివాయిపల్లిలో చోటు చేసుకున్నది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో పని చేసే స్వామి ఇటీవల పొందుర్తి పాఠశాలకు బదిలీ అయ్యారు. అయితే, ఆయన ట్రాన్స్‌ఫర్‌పై వెళ్తుండడాన్ని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు సైతం తట్టుకోలేక పోయారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తల్లిదండ్రులు, గ్రామస్తులు స్కూల్‌లో సమావేశమయ్యారు. మూతబడిన పాఠశాలలను పునఃప్రారంభించడమే కాకుండా 200 మందికి పైగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో స్వామి సార్ చేసిన కృషిని కొనియాడారు. ఆయనను తిరిగి గ్రామానికే పంపించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు ముక్తకంఠంతో కోరారు. ఈ మేరకు ఉన్నతాధికారులను కలిసి బదిలీని రద్దు చేయాలని కోరాలని తీర్మానించారు.

పాఠశాలలో సమావేశమైన తల్లిదండ్రులు, గ్రామస్తులు

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి

- దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వాలి
- కలెక్టరేట్ ఎదుట వికలాంగుల పోరాటసమితి ఆధ్వర్యంలో ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, వివిధ సంఘాల ప్రతినిధులు

కంఠేశ్వర్, జూలై 5: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్ పెంచి ఇవ్వాలని వికలాంగుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్)జాతీయ మహిళా అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ. 6వేలు, వృద్ధులు, వితంతవులకు రూ.2 వేల నుంచి రూ. 4వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదని అన్నారు. అధికారం రాకముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి పెంచిన పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో దివ్యాంగులలు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.